ప్రారంభోత్సవానికి ముస్తాబు

- రూ. 30 లక్షలతో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం
- పూర్తి కావస్తున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాఠకులు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రామడుగు గ్రంథాలయం

రామడుగు: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు, విద్యార్థులకు అవసరమైన సమాచారం అందించే గ్రంథాలయం నూతన భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబు అవుతోంది. మండల కేంద్రం రామడుగులోని బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న భవనం పనులు తుదిదశకు చేరుకున్నాయి.

రూ. 30 లక్షలతో...

మండల కేంద్రం రామడుగులో పాత గ్రంథాలయం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు కేటాయించింది. సోషల్ వెల్ఫేర్‌శాఖ ఆధ్వర్యంలో ఏడాది క్రితం బస్టాండ్ వద్ద నూతన భవనం నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

పనుల పరిశీలన

వారం రోజుల క్రితం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ భవన నిర్మాణం పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు.

అన్ని వసతులతో...

నూతన భవనాన్ని అన్ని వసతులతో రీడర్స్‌కు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణం చేస్తున్నారు. పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ కూడా అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండుచోట్ల నూతన భవనాలు



కరీంనగర్ జిల్లాలో రామడుగు, వీణవంక మండల కేంద్రాల్లో నూతన గ్రంథాలయ భవనాలు నిర్మిస్తున్నాం. రామడుగులో పనులు పూర్తి కావస్తున్నాయి. వీణవంకలో పనులు కొంతమేర చేయాల్సి ఉంది. వారం రోజుల్లో రామడుగు నూతన భవనాన్ని ప్రారంభిస్తాం.

– పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కరీంనగర్

ఇబ్బందిపడ్డారు



మండల కేంద్రంలోని నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చాలా బాగుంది. పాత భవనం శిథిలావస్థలోకి చేరడంతో పాఠకులు చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ ఇప్పుడు నూతన భవనం బస్టాండ్ వద్ద నిర్మిస్తుండటంతో చాలామందికి ఉపయోగకరంగా ఉంటుంది.

– పూరెల్ల మనోజ్, రామడుగు

త్వరలో ప్రారంభిస్తాం



నూతన గ్రంథాలయ భవనం త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం ముప్పై లక్షలు నిధులు కేటాయించింది. అందరికీ అందుబాటులో ఉండేలా బస్టాండ్ వద్ద నిర్మాణం చేస్తున్నాం. త్వరలో భవన ప్రారంభోత్సవం చేస్తాం.

– పంజాల ప్రమీల, సర్పంచ్, రామడుగు

క్లుప్తంగా

బొమ్మనపల్లిలో కంటి వెలుగు శిబిరం


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కానుగంటి భూంరెడ్డి ప్రారంభించారు. శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం గతేడాది కూడా శిబిరం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్, ఉపసర్పంచ్ పెండ్యాల శారదసదానందం, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, మాజీ ఎంపీటీసీ కత్తుల రమేశ్, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, హెల్త్ సూపర్ వైజర్ హాజీబాబా, వార్డు సభ్యులు కొమురయ్య, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే పోటీలు


సర్టిఫికెట్లతో విద్యార్థులు

గంగాధర: మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో గురువారం విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో 130 మంది విద్యార్థులు పాల్గొని వివిధ స్థాయిల్లో బెల్టులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మ స్థైర్యం, ఆరోగ్యానికి కరాటేఎంతో దోహదపడుతుందన్నారు. బెల్టులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అనంతరెడ్డి, ఉషారాణి, శిక్షకుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకరపట్నం: వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను గురువారం కేశవపట్నంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల26, 27వ తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్ కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి సమ్మయ్య, కుమార్,రవీందర్,స్వామి,రాజమల్లు, వెంకటేశ్,శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర కరపత్రాలు..


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీపీఎం జోన్ కార్యదర్శి శీలం అశోక్ అన్నారు. గురువారం పట్టణంలో సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్, గాంధీ చౌక్‌లో జనచైతన్య యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని ఆరోపించారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఖండిస్తూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నిర్వహించే సీపీఎం జనచైతన్య యాత్ర 26న కరీంనగర్‌కు చేరుకుంటుందని, మేధావులు, కార్మిక సంఘాలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జోన్ కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, దండిగారి సతీష్, సీహెచ్ రాములు, కన్నం సదానందం, వడ్లూరి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. ఐదునెలలకు సంబంధించి రూ.1,80,647 వచ్చినట్లు ఆలయ ఈవో ఎన్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో పూజా సామగ్రి, కొబ్బరికాయలు అమ్ముకునేందుకు టెండర్‌కు బహిరంగ వేలం నిర్వహించగా పదకొండు లక్షలకుపైగా ఆదాయం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ పర్యవేక్షకులు సత్యనారాయణ, ఫౌండర్ ట్రస్టీలు గర్రెపల్లి శంకర్ లింగం, ఆకుల గోపాల్‌రావు, ఆలయ ఉద్యోగులు, పూజారులు, బ్యాంకు అధికారులు, గోవిందా సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలపై గ్రామసభలు


చీమలకుంటపల్లెలో అధికారులు, ప్రజాప్రతినిధులు

గన్నేరువరం: ఎస్సీ కార్పొరేషన్ 2022–23కు సంబంధించి రుణాలపై గురువారం గన్నేరువరం, యాస్వాడా, గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లె గ్రామ పంచాయతీల్లో బ్యాంకర్లతో కలిసి మండల పరిషత్, రెవెన్యూ అధికారులు లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహించారు. మండలానికి 125 మినీ డెయిరీ యూనిట్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఒక్కో యూనిట్ రూ. 2 లక్షలు కాగా రూ. 1.40 లక్షల సబ్సిడీ వర్తిస్తోందని, రూ. 60 వేలు బ్యాంకు ద్వారా లోన్ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో నర్సింహారెడ్డి, సర్పంచులు పుల్లెల లక్ష్మీ, జక్కనపెల్లి మధుకర్, లింగంపల్లి జ్యోతి, కర్ర రేఖ, ఉప సర్పంచులు బూర వెంకటేశ్వర్లు, జంగిడి ప్రకాశ్, పశువైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎంపీపీ

హుజూరాబాద్‌రూరల్: ఉగాది పండుగ పురస్కరించుకొని సిద్దిపేటలో ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హుజూరాబాద్ ఎంపీపీ ఇరుమల్ల రాణి సురేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీవాణి

రామడుగు: విద్యార్థి దశ నుండే సేవాభావం అలవర్చుకోవాలని శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె. శ్రీవాణి అన్నారు. మండలంలోని వెదిర గ్రామంలో గురువారం ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి హాజరై మాట్లాడారు.. విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక, సామాజిక, మౌలిక వనరుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చైతన్యం కలిగించాలని సూచించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ, వివేకానంద, జ్యోతిరావుపూలే వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ తీగల సంగీత మాట్లాడుతూ... గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో యూనిట్ ప్రోగాం ఆఫీసర్ సురేష్‌కుమార్ అధ్యాపకులు, పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై బీఎస్పీ నిరసన


హుజూరాబాద్‌లో బీఎస్పీ నాయకుల నిరసన

మానకొండూర్: టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషాని రాంచంద్రం అన్నారు. గురువారం మానకొండూర్‌లో ఒకరోజు రిలే నిరాహార దీక్షలో మాట్లాడారు. ముప్పై లక్షల మంది నిరుద్యోగులు అప్పు చేసి పరీక్షలకు ప్రిపేరవుతున్న తరుణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నపత్రాలను అమ్ముకుందని ఆరోపించారు. బోర్డు చైర్మన్, కేటీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చైర్మన్ జనార్దన్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏనుగుల లింగయ్య, సంపత్, , ప్రభాకర్, ప్రమీల, మాతంగి మల్లయ్య, వెంకన్న, ఆరెల్లి రాజు, సాయికృష్ణ, రమాకాంత్, బాను చందర్, సత్యనారాయణ, ఎల్లయ్య, రామచంద్రం, తిరుపతి, స్వామి, తిరపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద గురువారం బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు మేకల రవీందర్, మిడిదొడ్డి స్వప్న, లలిత, మారెపల్లి మొగిలయ్య, మంద సమ్మయ్య, కూరపాటి రామచంద్రం, రామ్ శ్రీనివాస్, రాచపల్లి రమేశ్, కోడిపెల్లి సదానందం, పల్లె ప్రశాంత్ గౌడ్, ఈదునూరి రమేష్, మహేందర్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రాణి

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల్లో పరిశుభ్రతపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ రాణి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సభ్యులకు స్వచ్ఛ భారత్ అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, ఎరువుల తయారీ, ప్లాస్టిక్ నియంత్రణ, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తొమ్మిది రకాల అంశాల్లో ప్రతిభ కనబర్చిన బొత్తలపల్లి, శాలపల్లి ఇందిరానగర్, జూపాక, తుమ్మనపల్లి, పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి, సిర్సపల్లి, రాంపూర్ జీపీలకు అవార్డులు రాగా సర్పంచులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బక్కారెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంపీవో సురేందర్, స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్లు వేణు, రమేష్, ఈజీఎస్ అధికారి శ్రీధర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: మండల కేంద్రంలో 28న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని గౌడ సంఘం భవనంలో గురువారం సన్నాహక సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ మండల కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు, చొప్పదండిలో బీజేపీ నాయకులు

నాయకుల ముందస్తు అరెస్టు

కరీంనగర్‌లో జిల్లాలో గురువారం సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, అరెస్టులతో ప్రజావ్యతిరేకత తగ్గించలేరని, ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ముందస్తు అరెస్టును నాయకులు ఖండించారు. – సాక్షి నెట్‌వర్క్

గన్నేరువరంలో షాహిద్ దివస్



షాహిద్ దివస్ కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, తదితరులు

గన్నేరువరం: ఎన్‌వైకేఎస్ కరీంనగర్ యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గురువారం షాహిద్ దివస్ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. భగత్‌సింగ్ సుఖ్‌దేవ్ థాపర్, శివరామ్‌రాజ్‌గురు తమ అసమాన పోరాటంతో ప్రజల మనుస్సులో చిరస్థాయిగా నిలిచిపోయారని, చిన్న వయస్సులోనే బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరులని, వారి జ్ఞాపకార్థం షాహిద్ దివస్ ప్రకటించారని తెలిపారు. నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. 1931 మార్చి 23న పాకిస్తాన్‌లోని పంజాబ్ హుస్సేన్‌వాలా ప్రావిన్స్‌లోని జైలులో వీరిని ఉరి తీశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినయ్, రాజు, మురళీకృష్ణ, పుల్లయ్య, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


సన్మానిస్తున్న జీపీ పాలకవర్గ సభ్యులు

గన్నేరువరం: గన్నేరువరం మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనంతరెడ్డి యాస్వాడ గ్రామ పంచాయతీని గురువారం సందర్శించారు. గ్రామ పాలకవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ భూ సమస్యలను ఆయన దృష్టికి తీసువచ్చారు. అనంతరం తహసీల్దార్‌ను శాలువాతో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుకర్, పాలకవర్గ సభ్యులు సోమిరెడ్డి అనూరాధ, కోడూరి సంపత్, గ్రామస్తులు సోమిరెడ్డి రంగారెడ్డి, కోడూరి మల్లయ్య, బుర్ర నవీన్, వడ్లూరి సతీష్, మామిడిపల్లి వినోద్, గువ్వల ప్రవీణ్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూసీ నాయకులు

చిగురుమామిడి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను అవలంబిస్తోందని, దీనికి వ్యతిరేకంగా నిర్వహించతలపెట్టిన చలో ఢిల్లీ ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఛలో ఢిల్లీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మికుల హక్కులు, కర్షక చట్టాల రక్షణ, నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ తదితర అంశాలపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలన్నారు. ఈజీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలని, ఏడాదిలో రెండువందల పనిదినాలు కల్పించడంతో పాటు కనీస వేతనం ఇప్పించేంత వరకు విశ్రమించొద్దన్నారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మారెల్ల శ్రీలత, నాయకులు సందబోయిని మల్లేశం, వేల్పుల రాములు, పెనుకుల రాజయ్య, గూడెం కుమార్, చేరుకు రాజయ్య, కల్పన, మల్లేశం, పోచయ్య పలువురు ఉన్నారు.

వైభవంగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్ స్కూల్ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్


చొక్కారావుపల్లెలో కూరగాయల పంటలపై క్షేత్ర ప్రదర్శన

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లె, పారువెల్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.చిరుధాన్యాలు, కూరగాయలపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. కిశోర్ బాలికలకు రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం తెలియజేశారు. సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆశ్రత్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు శారధ, ప్రేమలత, ఆయాలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఇల్లందకుంట: మండల పరిధిలోని కేజీబీవీ విద్యార్థినులకు ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి తులసిదాస్ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు ఉన్నవారు వెంటనే స్థానిక ఆరోగ్యకేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరునెలల వరకు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 బ్యాంకు ఖాతాలో జమచేస్తామని తెలిపారు. క్షయవ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, రమాదేవి, దామోదర్, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

తిమ్మాపూర్: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి అని, సీపీఆర్‌తో కార్డియాక్ అరెస్ట్ అయినవారిని బతికించవచ్చని డాక్టర్ రాజేంద్రప్రసాద్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ చైర్మన్ కేశవరెడ్డి అన్నారు. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి,సొసైటీ సెక్రటరీ రాధాకృష్ణారెడ్డి, డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సాయినాథ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యజమానికి రూ.2,500 జరిమానా

ఇల్లందకుంట: ప్రకృతి వనంలోని మొక్కలను గొర్రెలు మేసినందుకు యజమానికి మండలంలోని వంతడుపుల గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న రూ.2,500 జరిమానా వేశారు. గురువారం గ్రామానికి చెందిన ఓ యజమాని గొర్రెలు మేస్తుండటంతో గమనించిన జరిమానా విధించామని, గ్రామ పంచాయతీలో డబ్బులు డిపాజిట్ చేశామని జీపీ కార్యదర్శి తెలిపారు.

బావిలో దూకి మహిళ మృతి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం రాత్రి తాగునీటి బావిలో దూకి గోదారి సుజాత(35) అనే వివాహిత మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మహిళను రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దత్తోజీపల్లిలో పశువులపై కుక్కల దాడి

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లిలో పశువులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని రైతులు తెలిపారు. కొద్దిరోజుల నుంచి పంట పొలాల వద్ద కట్టేసి ఉన్న పశువులపై కుక్కలు మూకుమ్మడిగా దాడిచేసి చంపివేయడంతో పాటు గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణం కుక్కలబారి నుంచి పశువులను కాపాడడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.